# స్వాప్నికుడు

-సి.జయపాల్‌రెడ్డి

శరత్కాలపు వెన్నెల.

**అడివంతా మనోహరంగా ఉంది. కీచురాళ్ళ శబ్దం తప్ప మరే శబ్దాలు విన్పించటంలేదు. చల్లటి గాలి మంద్రంగా వీస్తోంది. వాతావరణం ఆహ్లాదంగా ఉంది. అయితే ఆ ఆహ్లాద వాతావరణాన్ని గమనించే స్థితిలో లేరు ఆ అడవిలోని చిన్నబోడు వద్ద మకాం వేసిన గెరిల్లా దళ సభ్యులు. అంతకు ముందు రోజే ఆ దళం ఓ పోలీసుస్టేషన్‌పై దాడి చేసింది. పోలీసులకు దొరక్కుండా అడవిలోకి చాలా దూరంగా వచ్చి అనువుగా ఉండటంతో అక్కడ విడిది చేశారు.**



పెద్దపెద్ద రాళ్ళ మధ్య స్లీపింగ్ బ్యాగ్స్‌లో దళ సభ్యులు నిద్రిస్తుండగా ఎనిమిది మంది మాత్రం సెంట్రీ డ్యూటీ చేస్తున్నారు. దళ సభ్యులందరి దగ్గరా ఎ.కె.47 తుపాకులు, హ్యాండ్ గ్రెనేడ్లు తదితర సామాగ్రి ఉంది. సెంట్రీలందరూ కళ్ళు చికిలించి వెన్నెల్లో కనపడినంత దూరం చూస్తున్నారు. ఎప్పుడు పోలీసులొచ్చినా ఎదుర్కొనేందుకు దళ సభ్యులంతా సర్వసన్నద్ధంగా ఉంటారు.

బోడుకు ఒకవైపు సెలయేరు రాళ్ళపై చిన్నగా శబ్దం చేస్తూ పారుతోంది. స్వచ్ఛమైన సెలయేటి నీరు వెన్నెల్లో ఎంతో ముచ్చటగొలుపుతోంది. యేటి ఒడ్డునే ఉన్న రెండు పెద్ద రాళ్లపై రాజన్న, కొమురన్న సెంట్రీలుగా ఉన్నారు. బోడు పైన ఇద్దరు మరో రెండు దిక్కుల చెట్లపొదల మాటున ఇద్దరేసి సెంట్రీలు కాపలా కాస్తున్నారు. అందరూ ఆలివ్‌గ్రీన్ దుస్తులు ధరించటంతో వారు చెట్లల్లో కలిసిపోయారు.

రాజన్న, కొమురన్న కూర్చున్న రాళ్ళు కనపడకుండా చెట్లు అడ్డుకుంటున్నాయి. కొమురన్న శ్రద్ధగా డ్యూటీ చేస్తుండగా రాజన్న మాత్రం యేటి గలగలలను వింటూ, వెన్నెల్లో మెరిసే నీటిని చూస్తూ శరత్కాలపు వెన్నెల రమణీయకతను ఆనందిస్తున్నాడు.

★★★

'కామ్రేడ్' మెల్లగా పిలిచాడు కొమురన్న. రాజన్న ఏదో దీర్ఘాలోచనలో ఉన్నాడు.

'కామ్రేడ్'

'... ...'

'రాజన్నా' కొంచెం గట్టిగా పిలిచాడు.

'ఏంటి' కొంచెం ఉలిక్కిపడినట్లుగా అన్నాడు.

'ఏదో దీర్ఘాలోచనలో పడినట్లున్నావు'

'ఆ... ఏం లేదు... అమ్మా నాయన... చెల్లీ తమ్ముడు... ఊరు గుర్తుకొచ్చింది.'

రాజన్న హృదయం బరువెక్కింది. వెక్కివెక్కి శబ్దం రాకుండా ఏడుస్తున్నాడు.

'ఊర్కో రాజన్నా... నువ్వు ఉద్యమంలోకి మొన్న మొన్ననే వచ్చినవ్... అందుకనే నువ్విట్లా బాధపడుతున్నావు. అందరం ఒక సిద్ధాంతం కోసం ఒక లక్ష్యం కోసం ఉద్యమంలో చేరినం'

'మన లక్ష్యం నెరవేరతదంటవా' కన్నీళ్ళు తుడుచుకుంటూ నిరాశగా అన్నాడు రాజన్న.

'లక్ష్యం సంగతి ఏమో గాని రాష్ట్రంలో ఎన్నో మార్పులకు మన ఉద్యమమే కారణం. ఇవాళ ప్రభుత్వం ప్రజల మెప్పు కోసం పాకులాడుతోందంటే కారణం మనం కాదా?'

'అన్నా... నువ్వన్నది నిజమే కానీ... ప్రజలు తిరగబడటం ద్వారా ప్రజారాజ్యం వస్తదనే దాంట్లో నాకైతే నమ్మకం అన్పిస్తలేదు.'

'... ...'

'విప్లవం రాదంటావ్... ఉద్యమం ఉండాలంటావ్... నీ ఉద్దేశం?'

'అన్నా ఇప్పటికే మనం ఎక్కువ మాట్లాడుకున్నాం... రేపు వేరే క్యాంపు కెళ్ళేటప్పుడు మాట్లాడుకుందాం.'

★★★

సూర్యోదయం అవటంతోనే దళ సభ్యులంతా లేచి కాలకృత్యాలు తీర్చుకుని కిట్‌బ్యాగులు సర్దుకున్నారు. ఈలోగా ఇద్దరు కామ్రేడ్స్ అందరికీ టీ తయారుచేసిచ్చాడు. టీ తాగిన వెంటనే కిట్ బ్యాగులు వీపులకు తగిలించుకుని దూరంగా కనపడే గుట్టలవైపు బయలుదేరారు.

'రాత్రి నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పనే లేదు.' కొమురన్న మెల్లగా సంభాషణ ప్రారంభించాడు.

' చెప్తా కొమురన్నా... మొదట్లో విప్లవ సిద్ధాంతంపట్ల ఆకర్షితులైన వారు ఎందరో మేధావులు, యూనివర్సిటీ విద్యార్థులు, మెడిసిన్, ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యమంలో చేరిండ్రు. ఇరవై ఐదేళ్ళకు పైగా సాగుతున్న ఈ ఉద్యమంలో ఎంతోమంది అమరులైండ్రు. ఉద్యమం ఎన్నో ఆటుపోట్లకు గురైంది. ఎన్నో చీలికలొచ్చాయి. అపశృతులు దొర్లినయ్. అయినా అనేక రూపాల్లో ఉద్యమం నడుస్తూనే ఉంది. ' అంటూ చెప్పటం ఆపాడు.

'రాజన్నా నువ్వు చెప్పిన దాంట్లో చాలా నిజాలే ఉన్నాయ్. ఉద్యమంలోకి ఎవరిని పడితే వాళ్ళను తీసుకోవడంవల్ల, పోలీసు దాడులు ఉధృతంగా ఉన్నప్పుడు కొరియర్ వ్యవస్థ దెబ్బతిని కొన్నిసార్లు ఉద్యమంపై పట్టు తప్పినట్లు కన్పించవచ్చు. మా తప్పులను మేం ఎప్పుడూ కప్పిపుచ్చుకోలేదు. అజ్ఞాతంలో ఉద్యమం నడుస్తున్నప్పుడు కొన్ని పొరపాట్లు జరగటం సహజం. మన వ్యతిరేకులు వాటిని భూతద్దంలో చూపించి ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తారు. అంతెందుకు ఇతర రాజకీయ పార్టీల్లో తప్పులు జరగటం లేదా... నువు చెప్పు'

'ఉన్నయ్... లేవనటంలేదు... అనేక నిర్బంధాల మధ్య పని చేస్తున్న మనం మరింత జాగ్రత్తగా ఉండాలనేదే నేననేది.'

'నిజమే'

'ప్రపంచీకరణ నేపథ్యంలో మన ఉద్యమాన్ని సమీక్షించు కోవాల్సిన అవసరం లేదా? ఉద్యమం ప్రారంభమైన రోజుల్లో సమాజంలో వున్న పరిస్థితులు ఇప్పుడున్నాయం టావా? నీలాంటి సీనియర్ సభ్యులు ప్లీనం సమావేశాల్లో లేవనెత్తితే బాగుంటది కదా కొమురన్నా'

'... ...'

'అది సరేలే కొమురన్నా... నువ్వన్నావు చూడు మన ఉద్యమం వల్ల చాలా మార్పులొచ్చాయని... కానీ ఇంకా చాలా మార్పు రావల్సి ఉంది... మన ఉద్యమ పంథాను మార్చుకుంటే ఇంకా మంచి మార్పులొస్తాయి కదా...'

'నువ్వనేదేమిటి?'

'ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యవస్థీకృతమైన అవినీతి ఉంది. అంతెందుకు ఉద్యమ ప్రభావం ఎక్కువగా వున్న ఉత్తర తెలంగాణా జిల్లాల్లో అవినీతి లేని ఆఫీసుగానీ, లంచా లకు ఆశపడని ఉద్యోగులను చూపించగలవా... లక్షల్లో ఒకరో, ఇద్దరో దొరుకుతారు నీతిమంతులు. ఇట్లా ఎందుకు జరుగుతోంది... మన దృష్టి అంతా పోలీసులను ఎదుర్కోవ టంలో ప్రజా నాయకులను టార్గెట్‌గా ఎంచుకోవటంలో కేంద్రీకృతమైంది... ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు మన ఉనికిని ఏ మాత్రం లెక్కచెయ్యటంలేదు. అమలుకు సాధ్యం కాని, ప్రజలను ఇబ్బంది పెట్టే బ్రిటీష్ కాలంనాటి నిబంధన లను ఇప్పటి అవసరాలకు అనుగుణంగా మార్చాల్సిన అవ సరం ఉంది. అవినీతికి మూలం ఇప్పుడున్న చట్టాలే కారణ మనేది నా అభిప్రాయం'

'అంటే... ఇతర శాఖల అవినీతి ఉద్యోగులను హెచ్చరించ మంటావు'

'అవును... అలా చేస్తే సామాన్య ప్రజానీకానికి మేలు జరు గుతుంది. చట్టాలను మార్చాలని నాయకులను బెదిరించాలి. అప్పుడు ప్రజలు మన ఉద్యమాన్ని మనస్ఫూర్తిగా సమర్థి స్తారు.'

'అప్పుడు మనది ఒక బందిపోటు ముఠా మాత్రమే అవు తుంది... మనకొక పార్టీ ఉంది... ఉద్యమం ఉంది... ఒక లక్ష్యం ఉంది. రాజన్నా నువ్వొక సాధారణ వ్యక్తిగా మాట్లాడు తున్నావు. మనం అలా చేస్తే ప్రజలు సోమరులుగా తయార వుతారు. ఎవరికి వారు చెడును ఎదుర్కోవాలి, పోరాటం చేసి సాధించుకోవాలి. ఈ మేరకు ప్రజల్లో చైతన్యం తేవటమే మన పని. మన లక్ష్యం నెరవేరితే సమసమాజ మేర్పడు తుంది. అంతేగాని తాత్కాలిక పద్ధతులవల్ల ఎలాంటి ఫలితా లుండవు.'

'చూడు... కొమురన్నా... ఇవ్వాళ ఏ సమాజం కోసమైతే మనం ఇంత త్యాగం చేస్తున్నామో ఆ సమాజం మనపట్ల నీస సానుభూతి కూడా చూపించటంలేదు. అదేదో పోలీ సుల - ఉద్యమకారుల గొడవ మనకెందుకులే అనే ధోర ణిలో ఉన్నారు. ప్రజలు పోరాటం చెయ్యటంకన్నా రాజీపడి బతకటానికి అలవాటుపడ్డారు. ఎవరైనా నీతిగా బతకాలను కుంటే వాళ్ళ బతుకు మరింత నరకమవుతుంది. ఇదీ ఇవ్వాళ్టి పరిస్థితి... ఎవరు ఒప్పుకున్నా... ఒప్పుకోకపోయినా...'

'రాజన్నా నువు చెప్పే విషయాలు ఆలోచించేవిగా ఉన్నాయి... ముఖ్యంగా నీతో సంభాషణ కొనసాగించాలనిపి స్తోంది నాకు... అదిగో మన వాళ్ళు మర్రిచెట్టు కింద భోజనం కోసం ఆగినట్లున్నారు. తర్వాత మాట్లాడుకుందాంలే'

ఉదయం నుండి సుమారు ఐదు గంటలపాటు నడవ టంతో దళ సభ్యులంతా అలసిపోయారు. మధ్యాహ్నం ఎండ బాగా కాస్తోంది. ఇద్దరు ముగ్గురు దళ సభ్యులు అన్నం వండే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. దగ్గరలో ఉన్న గూడెం నుంచి సరంజామా వచ్చింది. గంటసేపట్లో అన్నం తయారవటంతో పచ్చళ్ళతో భోజనం కానిచ్చారు. ఎప్పుడోగాని దళ సభ్యులకు అన్నం తినే అవకాశం రాదు. సెంట్రీలు మినహా మిగతా సభ్యులంతా చదువుకోవటంలోనో కునుకు తీయటంలోనో నిమగ్నమయ్యారు.

రాజన్న, కొమురన్న మాత్రం కొద్ది దూరంలో వున్న మరో చెట్టు కిందికెళ్ళారు.

'రాజన్నా... మైదాన ప్రాంతం నుండి నువ్వు ఇటీవలే దళం లోకి వచ్చినవ్ కాబట్టి నువ్వు పార్టీ సిద్ధాంతంతో ఏకీభవించ టంలేదు. కొద్దిరోజులు పోతే నువ్వు పూర్తిగా మా మార్గం లోకి వస్తావు.'

'కేవలం పోలీసుల్ని మాత్రమే శత్రువులుగా భావించ టంలో మాత్రం నేను ఏకీభవించను... చెడ్డ పోలీసులు వున్న ట్లుగానే అన్ని శాఖల్లోను చెడ్డ ఉద్యోగులున్నారు. వాళ్ళను కూడా మనం శిక్షించాలనేదే నా వాదన. ఇతర ఉద్యోగుల్లా గానే పోలీసులు జీతానికి పనిచేస్తున్నారు. మన వాళ్ళు చచ్చి పోతున్నారు... పోలీసులు చచ్చిపోతున్నారు. మిగతా సమాజం మాత్రం ఇదంతా ఒక తమాషాలాగా చూస్తోంది. అక్కడే నాకు బాధ కలుగుతోంది.'



'రాజన్నా నాకొకటనిపిస్తోంది. నువ్వు ఉద్యమంపై పూర్తి ఇష్టంతో చేరినట్లు లేదు నిజమేనా?'

'... ...'

'అహా... నీ మాటల్నిబట్టి చూస్తే నాకలా అనిపిస్తోంది.'

'నువ్వన్నది నిజమే కొమురన్నా... ఈ సమాజమే నన్ను అజ్ఞాతంలోకి నెట్టేసింది.'

తనకు తానే చెప్పుకున్నట్లుగా - శూన్యంలోకి చూస్తూ. 'మా అక్కపై అత్యాచారం చేసిన దుర్మార్గుడికి శిక్ష పడాలని ఎంతో ప్రయత్నించాను. కోర్టుల చుట్టూ తిరిగి మా అక్క సిగ్గుతో చితికిపోయింది. అత్యాచారం చేసిందెవరో అందరికీ తెలుసు... కోర్టులో మాత్రం రుజువు కాలేదు. మా అక్క ఆత్మహత్య చేసుకుంది. వాడు హాయిగా తిరుగుతున్నాడు. హత్యలు చేసినా, అత్యాచారం చేసినా, యాసిడ్ పోసినా ఎవ రికీ శిక్ష పడదు. అలాంటి వాళ్ళను మనమే శిక్షించాలి... మనమే శిక్షించాలి...' కోపంతో మరింక మాట్లాడలేకపో యాడు. ఇద్దరూ కాసేపు మౌనంగా వుండిపోయారు.

మనసు తేలిక పడ్డాక కొమురన్న అన్నాడు

'రాజన్నా... వచ్చే నెలలో బస్తర్ అడవుల్లో రాష్ట్ర కమిటీ ప్లీనం జరుగనుంది. నువ్వు చెప్పిన విషయాన్ని ఎజెండాలో చేర్పించేందుకు ప్రయత్నించమని మన దళ నాయకుడు ప్రసాదన్నను ఒప్పిస్తా... ఇది మంచి అంశమని నేను కూడా నమ్ముతున్నాను.'

'కొమురన్నా ఈ పనిచేస్తే నీకు రుణపడి ఉంటాను' రాజన్న ముఖంలో ఆశ ప్రతిఫలించింది.

చీకటి పడకముందే దళం మరో చోటుకు బయలుదేరింది.

★ ★ ★

రాత్రి పదకొండవుతోంది.

వెండి జలతారు ఆరబోసినట్లుంది వెన్నెల.

చల్లటి గాలి హాయిగా వీస్తోంది. దళ సభ్యులంతా నిద్రపో తున్నారు. రాజన్నకు మాత్రం నిద్ర రావటంలేదు. స్లీపింగ్ బ్యాగులో అటు ఇటు దొర్లుతున్నాడు. బుర్రనిండా రకరకాల ఆలోచనలు. తాను ఎన్నటికైనా సాధారణ జీవితం గడపగ లడా? తన గురించి అమ్మా నాయన తమ్ముడు చెల్లి బంధు వులు ఊరి వాళ్ళు ఏమనుకుంటున్నారో... పోలీసులు మా వాళ్ళను వేధిస్తున్నారా... అయ్యో నా మూలంగా వాళ్ళు బాధపడుతున్నారో ఏమో... ఆలోచనలు ఎంతకూ ఆగిపోవ టంలేదు. తల గట్టిగా విదిలించి లేచాడు. సెంట్రీ డ్యూటీలో వున్న కొమురన్న వైపు వెళ్ళాడు.

'ఎవరదీ' - కొమురన్న అలర్టయ్యాడు.

'నేనే... రాజన్నను'

'నిద్రపోలేదా'

'లేదన్నా... నిద్ర రావటంలేదు'

'సరే... ఏదైనా మాట్లాడదాం రా'

'ఎందుకులే కొమురన్నా నువ్వెళ్ళి పడుకో... వెన్నెల ఎంతో హాయిగా ఉంది... నేను డ్యూటీ చేస్తాలే'.

సరేనని కొమురన్న వెళ్ళిపోయాడు.

కొమురన్న చేతిలోని తుపాకీ తీసుకుని పొజిషన్‌లోకి వచ్చాడు.

తన వూళ్ళో వున్నప్పటి వెన్నెల రాత్రులను, యూనివర్సి టీలో వున్నప్పటి రాత్రులను గుర్తుచేసుకున్నాడు. సాధారణ జీవితంలో వుంటే ఇప్పుడెక్కడ ఉండేవాడో....

రాత్రి పన్నెండు గంటలు. అంతటా నిశ్శబ్దం.

అప్పటికి గంట క్రితమే దళం అక్కడుందన్న సమాచా రాన్ని ఇన్‌ఫార్మర్ ద్వారా తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ మోహన్ తన పటాలంతో బయలుదేరాడు. ఏ మాత్రం శబ్దం చెయ్య కుండా దళానికి కొద్ది దూరంలో మోహరించారు. సెంట్రీ డ్యూటీ చేస్తున్న రాజన్న పోలీసులకు వెన్నెల్లో లీలగా కనిపి స్తున్నాడు. ఆలోచనల్లో వున్న రాజన్న పోలీసులను గమ నించే స్థితిలో లేడు. మిగతా సభ్యులు సెంట్రీకి ఎంత దూరంలో ఉన్నారో పోలీసులకు తెలియటంలేదు. ఒక్క పోలీసును కూడా నష్టపోకుండా దళం మొత్తాన్ని మట్టుబెట్టా లని ఇన్‌స్పెక్టర్ మోహన్ చాలా జాగ్రత్తగా సూచనలిస్తు న్నాడు. మెల్లగా తన రివాల్వర్‌కి సైలెన్సర్ బిగించాడు. సెంట్రీకి గురిచూసి పేల్చాడు. సర్రున గాలిని చీల్చుకుంటూ వెళ్ళి బుల్లెట్ రాజన్న ఛాతీలో దిగబడింది. మెత్తగా శబ్దం చేస్తూ. కళ్ళ ముందు ఏవో వెలుగులు. రక్తం చివ్వున చిమ్మింది. భరించలేని నొప్పి. క్షణంలో ఏం జరుగుతోందో అర్థమైంది. పోలీసులు ఏ వైపు నించి వస్తున్నారో తెలియటం లేదు. సత్తువన కూడగట్టుకుని పోలీసులు... పోలీసులు అని గట్టిగా అరుస్తూ గాలిలోకి కాల్పులు జరుపుతూ పక్కకు దబ్ మని పడిపోయాడు. అప్పటికే మరికొన్ని బుల్లెట్లు రాజన్న శరీరంలో దిగబడ్డాయి. దళ సభ్యులంతా క్షణాల్లో లేచి కాల్పులు జరుపుతూ చెట్లల్లో మాయమయ్యారు.

తుపాకుల మోతతో అడవి దద్దరిల్లిపోయింది.

పావుగంట తర్వాత మళ్ళీ నిశ్శబ్దం. దళం విడిది చేసిన చోటుకు పోలీసులు వచ్చారు. సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. సెంట్రీ తప్ప మరెవ్వరూ చనిపోలేదు.

'ఛట్ ఒక్కన్నే చంపగలిగాం' ఇన్‌స్పెక్టర్ మోహన్ నేలను తన్ని తన అసహనాన్ని వెలిబుచ్చాడు.

• • •

హైదరాబాద్, సెప్టెంబర్ 20: నిన్న రాత్రి భద్రాచలం అటవీ ప్రాంతంలో అర్ధరాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో రాజశే ఖర్ అలియాస్ రాజన్న అనే తీవ్రవాది మరణించినట్లు పోలీ సులు తెలిపారు. మిగతా దళ సభ్యులంతా తప్పించుకు న్నట్లు, సంఘటనా స్థలంలో ఎ.కె.47 తుపాకీ, హ్యాండ్ గ్రెనేడ్లు, కిట్ బ్యాగులు, కొంత విప్లవ సాహిత్యం... కళ్ళకు నీటిపొర అడ్డురావడంతో ఇక పేపర్ చదవలేక పోయాడు కొమురన్న.

'నువ్వు రాజన్నా నేనే నీకు రుణపడి ఉంటాను' మనసులో అనుకున్నాడు కొమురన్న. ★